క్లుప్తంగా

అంజన్నకు విశేష పూజలు


స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామివారి క్షేత్రాన్ని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి తమలపాకులతో విశేష పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. స్వామివారికి రూ:1,28,345 ఆదాయం సమకూరింది. 1,000 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

23 నుంచి పవిత్రోత్సవాలు

ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు మద్ది క్షేత్రంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. పవిత్రోత్సవాలు జరిగే తేదీలలో గర్భాలయ దర్శనం, అష్టోత్తర పూజలు రద్దు చేస్తున్నట్లు ఈవో తెలిపారు. భక్తులు గమనించాలని కోరారు.

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం


శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి

కొయ్యలగూడెం: రాజవరం గ్రామంలో ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి మంగళవారం ప్రారంభించారు. ప్రధాన వాటర్ ట్యాంక్ సెంటర్ సమీపంలో తపన ఫౌండేషన్ ఆధ్వర్యాన మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకుడు ఆరేటి ఏసుబాబు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలపడటానికి కుట్టు శిక్షణ ఉపయోగపడుతుందని, మండల వ్యాప్తంగా శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు ఫౌండేషన్ కృషి చేయాలని కోరారు. సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, ఉప సర్పంచ్ అనంతల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల మార్పు

కొయ్యలగూడెం: మండల వ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాలను మార్చినట్లు తహసీల్దార్ పాసం నాగమణి మంగళవారం చెప్పారు. ఎంపీపీ స్కూళ్లలో ఇప్పటి వరకు నిర్వహించిన 12 పోలింగ్ కేంద్రాలను సమీపంలోని కేంద్రాలకు మార్చినట్లు తెలిపారు. పొంగుటూరు హైవేకు అనుకుని ఉన్న రెండు కేంద్రాలు, అదేవిధంగా బయ్యనగూడెంలోని మూడు కేంద్రాలు, దిప్పకాయలపాడులో ఒకటి, మంగపతిదేవిపేటలోని రెండు కేంద్రాలు, అంకాలగూడెంలోని రెండు, పరింపూడి బాలిక ఉన్నత పాఠశాలలో ఒకటి, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకటి పోలింగ్ కేంద్రాలను మార్చినట్లు చెప్పారు. ఈ పోలింగ్ కేంద్రాలు అన్ని కూడా సమీపంలోని హైస్కూళ్లలోకి మార్చినట్లు తెలిపారు.

గణనాధునికి వెండి తొడుగు బహూకరణ


వెండి తొడుగును బహుకరించిన దాతలు

జంగారెడ్డిగూడెం రూరల్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి గ్రామంలో ఉన్న గణనాధుని ఆలయంలోని స్వామివారికి ప్రగడ గంగరాజు దంపతులు, సుంకర వాసుదేవ నాయుడు దంపతులు వెండి తొడుగును బహుకరించారు. ఆలయ అర్చకులు వెండి తొడుగును స్వామివారికి అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయ స్వామివారి క్షేత్రం ప్రాంగణంలో గణేష్ ప్రతిమను నెలకొల్పి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రభుత్వ సౌకర్యాలను వినియోగించుకోవాలి


కన్నాపురం హాస్టల్‌లో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని చదువుతో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కన్నాపురం సర్పంచ్ ఉప్పల పద్మావతి సూచించారు. మంగళవారం మండలంలోని కన్నాపురం సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు సర్పంచ్ చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని వసతి గృహ సంక్షేమ అధికారి ముప్పిడి రాజు సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకూ నేరుగా సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- బుట్టాయగూడెం మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం


ఉప్పరిల్లలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో మారుమూల అటవీ ప్రాంత గ్రామాల్లోని ప్రజలకూ సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని మారుమూల గ్రామాలైన కన్నారపాడు, ఉప్పరిల్ల, ముంజులూరు, ఒర్రింకతో పాటు రెడ్డికోపల్లి కొండరెడ్డి గిరిజన గ్రామాల్లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే బాలరాజు ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ గిరిజనులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గిరిజనుల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. పులిరామన్నగూడెం నుంచి గోగుమిల్లి వరకు తారురోడ్డు ఏర్పాటు చేసి మారుమూల కుగ్రామాల గిరిజనులకు రహదారి కష్టాలు తీరేలా కృషి చేశారని తెలిపారు. అయితే వైఎస్సార్ మరణం తర్వాత వచ్చిన ప్రభుత్వాలు గిరిజను సమస్యలను గాలికి వదిలేశారని విమర్శించారు. జిల్లాలో జరిగిన పాదయాత్రలో గిరిజనుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన సంక్షేమానికి పెద్ద పీట వేయడం జరిగిందని చెప్పారు. ఇప్పటికే ఇటుకులకుంట అడ్డ రోడ్డు నుంచి రెడ్డి కోపల్లి వరకు తారురోడ్డు పనులు పూర్తి అయ్యాయని చెప్పారు. ఉప్పరెల్లకు కన్నారప్పాడు అడ్డరోడ్డు నుంచి ఉప్పరిల్ల వరకూ సిమెంట్ రోడ్డు పనులు పూర్తయ్యాయని చెప్పారు. త్వరలోనే పులిరామన్నగూడెం నుంచి గోగుమిల్లి రోడ్డు పనులు కూడా ప్రారంభమవుతాయని చెప్పారు. ఇదిలా ఉండగా వీరన్నపాలెం గిరిజనులు తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడంతో పాటు కాల్వపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ఒర్రింక గ్రామ గిరిజనులు ఎమ్మెల్యే బాలరాజును వెంట బెట్టుకుని ఆ గ్రామానికి తీసుకువెళ్ళారు. రహదారికి ఇటీవల వర్షానికి కొట్టుకుపోయిన గండిని చూపించారు. అలాగే పలు సమస్యలను బాలరాజు దృష్టికి తీసుకువెళ్ళారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ కుక్కల వరలక్ష్మి, సర్పంచ్‌లు కెచ్చెల ముక్కారెడ్డి, మడివి శ్రీరాములు, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, న్యాయవాది ఉద్దండం ఏసుబాబు, ఎంపీటీసీ మడకం వెంకటలక్ష్మి, పార్టీ నాయకులు ముత్యా సాహెబ్, కారం వెంకట రమణ, యోహాన్ నాయక్, ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, ఎంఈఓ బాబూరావు, వెలుగు ఏపీఎమ్ పద్మావతి, ఎస్సై వెంకన్న, కార్యదర్శి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణపతి శరన్నవరాత్రులు


బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు


జంగారెడ్డిగూడెంలో విఘ్నేశ్వరుని దర్శించుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు


ద్వారకాతిరుమల శివారు లక్ష్మీపురం ఆలయం వద్ద నుంచి బయల్దేరుతున్న గణనాధుల విగ్రహాలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణంలో గణపతి శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభయ్యాయి. ఆయా ప్రాంతాల్లో నిర్వాహకులు ఏర్పాటు చేసిన చలువ పందిళ్లల్లో గణనాథుడు కొలువై పూజలందుకుంటున్నాడు. 15 వార్డుల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవల్లి విజయ సారధి, ఉభయగోదావరి జిల్లాల బూత్ కమిటీల కో-ఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి, జెడ్పీటీసీ, పార్టీ ఏలూరు జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి, సీనియర్ నాయకులు మేడవరపు విద్యాసాగర్, మున్సిపల్ వైస్ చైర్మన్లు ముప్పిడి వీరాంజనేయులు, కంచర్ల వాసవి రత్నం, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ చింత అనిల్ కుమార్, చిప్పాడ వెంకన్న, కంచెర్ల విష్ణు పాల్గొన్నారు.

పారిజాతగిరిలో..

గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో కొండ దిగువన గోకుల ఉద్యానవనంలో వేంచేసి ఉన్న విఘ్నేశ్వరుని సన్నిధిలో వినాయక చవితి వేడుకలు వైభవంగా జరిగాయి. అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు, అగ్నిహోత్రం కుమార్ ఆచార్యులు పూజలు నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి మానికల రాంబాబు, అభివృద్ధి కమిటీ సభ్యులు దండు ధనరాజు పాల్గొన్నారు.

వాడవాడలా..

వాడవాడలా వినాయక చవితి వేడుకలకు నిర్వాహకులు భారీ స్థాయిలో ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని సుబ్రహ్మణ్యేశ్వస్వామి గుడి, హైస్కూల్ వద్ద, బస్టాండ్ వద్ద పేరంపేట రోడ్డు మీ సేవ, పేరంపేట వినాయకుడి గుడి తదితర ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఎమ్మెల్యే దంపతుల పూజలు

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంతంలో వినాయక చవితి వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని దుద్దుకూరులో ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు రామాలయం వద్ద ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని ప్రతిమ వద్ద పూజలు చేశారు.

టి.నరసాపురంలో..

టి.నరసాపురం: మండలంలో వాడవాడలా వినాయక విగ్రహాలను నెలకొల్పి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు వినాయక చవితి పందిళ్ల వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు మండల కేంద్రమైన టి.నరసాపురం ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహం వద్ద బుధవారం అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలో 13 చోట్ల భారీ గణనాథుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. మెయిన్ సెంటర్‌లో గణపతి ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు నిర్వహించనున్నారు. వైఎస్సార్ నగర్‌లో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. మిషనరీ హాస్పిటల్ గణపతి ఆలయం వద్ద, థియేటర్ గణపతి, కన్నాపురం, రాజవరం, బయనగూడెం మెయిన్ సెంటర్లలో గణనాథులు విగ్రహాలను ఏర్పాటు చేశారు.

కొలువుదీరిన గణపయ్య

ద్వారకాతిరుమల: గణేష్ నవరాత్రి ఉత్సవాలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఉత్సవ కమిటీ సభ్యులు ప్రధాన కూడళ్లల్లో గణనాధుని భారీ ఎత్తు విగ్రహాలను నెలకొల్పారు. ముందుగా ద్వారకాతిరుమల శివారు లక్ష్మీపురం ఆలయం వద్ద గణేష్ విగ్రహాలకు శ్రీవారి దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాధరావు పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు, యువకులు భారీ ర్యాలీలు, ఊరేగింపులతో విగ్రహాలను తీసుకెళ్లి మందిరాల్లో ఏర్పాటు చేశారు. ద్వారకాతిరుమల, తిమ్మాపురం, గొల్లగూడెం, తిరుమలంపాలెం, పంగిడిగూడెం, ఎం.నాగులపల్లి, గొడుగుపేట, ఐఎస్.రాఘవాపురం, నారాయణపురం, రామన్నగూడెం ఇలా ప్రతి గ్రామంలోనూ ఈ వేడుకలు వైభవంగా జరిగాయి.

మరలా వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే

చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా


కొత్తూరులో శ్మశాన వాటిక, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

కామవరపుకోట: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మరలా రానున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ధీమా వ్యక్తం చేశారు. మండలంలో మంగళవారం పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. వీరిశెట్టిగూడెం జగనన్న కాలనీలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, రూ.5 లక్షలతో కొత్తూరులో హిందూ శ్మశాన వాటిక, సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఇటీవల విద్యుత్ ప్రమాదంలో కాలు కోల్పోయి, కామవరపుకోటలో చికిత్స పొందుతున్న సాగిపాడు గ్రామానికి చెందిన దత్తడి చందును పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలిజా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. దీంతో రాష్ట్ర ప్రజలు మరలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైపే చూస్తున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 175 సీట్లు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు మిడత రమేష్‌బాబు, నానాది సాగర్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, కోటగిరి కిషోర్ బాబు, అయితం మహేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

గిరిజనుల విద్యాభివృద్ధికి సీఎం జగన్ కృషి

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు


రెడ్డికోపల్లి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులను పాఠ్యాంశ బోధనను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: గిరిజనుల విద్యాభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన రెడ్డికోపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులను పాఠ్యాంశ బోధనా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా 9వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న డిజిటల్ క్లాస్‌లను స్వయంగా దగ్గరుండి ఆయన తిలకించారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ మారుమూల కుగ్రామంలో ఉన్న పాఠశాలలు సైతం నాడు- నేడు పథకంలో రూపురేఖలు మార్చడమే కాకుండా పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన చదువులతో పాటు భోజన సదుపాయం కూడా కల్పించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. రెడ్డికోపల్లి వంటి మారుమూల కుగ్రామంలో విద్యార్థులకు డిజిటల్ పాఠాలు చెప్పేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యావకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువుల్లో ముందుకు సాగాలని ఆయన కోరారు. ఆయన వెంట ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ కుక్కల వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, న్యాయవాది యు.ఏసుబాబు, ఎస్సై వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ – నూతన కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న అధ్యక్షుడు ఘంటశాల గాంధీ, కార్యవర్గ సభ్యులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం 1వ వర్జీనియా పొగాకు వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు ఘంటశాల గాంధీ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈయనతో పాటు మిగిలిన కార్యవర్గం సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. రైతు సంఘం అధ్యక్షుని నియమించేందుకు 5మన్ కమిటీని ఏర్పాటు చేశారు. గడ్డమణుకు సత్యనారాయణ, గద్దే లక్ష్మణరావు, సుంకవల్లి వీరభద్రరావు, పిన్నమనేని రాధాకృష్ణ, కరాటం రెడ్డిబాబుతో కమిటీ ఏర్పాటు చేయగా, రైతు సంఘం అధ్యక్షునిగా వైఎస్సార్ సీపీ నాయకుడు, ములగలంపల్లి సొసైటీ అధ్యక్షుడు ఘంటశాల గాంధీని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. 5మన్ కమిటీ ప్రతినిధి సుంకవల్లి వీరభద్రరావు నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ నేపథ్యంలో వేలం కేంద్రంలో గల 7 క్లస్టర్‌ల నుంచి క్లస్టర్‌కు ముగ్గురు చొప్పున 21 మందిని కార్యవర్గంగా ఎన్నుకున్నారు. వీరిలో గాంధీ అధ్యక్షుడు కాగా, ఉపాధ్యక్షుడుగా మద్దిపాటి వెంకట సూర్యనారాయణ, కార్యదర్శిగా మల్లం వసంతరావు, సంయుక్త కార్యదర్శిగా మల్లెల్లి రాంబాబు, కోశాధికారిగా పోల్నాటి రమేష్ నియమితులయ్యారు. మిగిలిన 16 మంది డైరెక్టర్లుగా వ్యవహరిస్తారు. కాగా, ప్రమాణ స్వీకారం అనంతరం అధ్యక్షుడు ఘంటశాల గాంధీ వర్జీనియా రైతు సంఘం అభివృద్ధికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అలాగే రైతుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఘంటశాల గాంధీని, కార్యవర్గాన్ని పలువురు రైతు నాయకులు అభినందించారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఓ వ్యక్తిని కొట్టి గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెంకు చెందిన బి.వీరబాబుకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరబాబు భార్య సింహాచలం అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుని అత్తవారింటికి వెళ్లడానికి నిరాకరించిందన్నారు. ఈ క్రమంలో ఈ నెల 17న వీరబాబు భార్యను అడగటానికి వెళ్లగా, అక్కడే ఉన్న సింహాచలం కర్రతో వీరబాబుపై దాడి చేశాడని తెలిపారు. తీవ్రంగా గాయపడిన వీరబాబు స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

ద్వారకాతిరుమల: ఇంట్లో చెప్పకుండా వచ్చిన ఇద్దరు చిన్నారులను పోలీసులు క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం మండలం చక్రదేవరపల్లి గ్రామానికి చెందిన కావేటి నరేష్, చొప్పవరపు ఉమేష్‌లు ఇంట్లో చెప్పకుండా ద్వారకాతిరుమల గ్రామానికి వచ్చారు. గ్రామంలో వీరిద్దరూ తిరుగుతుండగా ఎస్సై టి.సుధీర్ విచారించారు. ఈ విద్యార్థుల తల్లిదండ్రులైన కావేటి రాము. ప్రభావతి, చొప్పవరపు దుర్గాప్రసాద్‌లకు ఎస్సై సమాచారం అందించి స్టేషన్‌కు పిలిపించారు. నరేష్, ఉమేష్‌లకు ఎస్సై కౌన్సిలింగ్ ఇచ్చి వారిని తల్లిదండ్రులకు అప్పగించారు.

పేకాట శిబిరంపై దాడి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తన సిబ్బందితో సోమవారం సాయంత్రం పేకాట శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,950 నగదు స్వాధీనం చేసుకున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన వెనుకబడిన, బలహీన వర్గాల ప్రజలు నివశించే గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్ కోరారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని సంఘ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మురుగు కాలువలు, రోడ్లు, విద్యుత్, తాగునీటి సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. దళిత సేన ఏలూరు జిల్లా అధ్యక్షుడు చిన్నాబి పాల్గొన్నారు.

మహిళల స్వయం సమృద్ధికి పటిష్ట కార్యాచరణ

ఏలూరు (టూటౌన్): మహిళల స్వయం సమృద్ధికి పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకానికి సంబంధించి ఏలూరు నియోజకవర్గం పరిధిలో వివిధ కారణాలతో డబ్బు జమ కాకుండా మిగిలిపోయిన 27 గ్రూపులకు రూ.48.20 లక్షలు ప్రభుత్వం తాజాగా వారి ఖాతాల్లోకి జమచేసింది. ఈ మేరకు డ్వాక్రా మహిళలు మంగళవారం ఆళ్ల నానిని తన క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. అర్హత ఉండి వివిధ కారణాలతో పథకాలు అందకుండా మిగిలిపోయిన వారందరినీ గుర్తించి న్యాయం చేశామని చెప్పారు. ఎన్నికల హామీ మేరకు డ్వాక్రా రుణాలను విడతల వారీగా మాఫీ చేశామని, వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా వడ్డీ రాయితీ మొత్తాన్ని ఎప్పటికప్పుడు డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు అందజేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో పీట కృష్ణమూర్తి, సీఎంఎం సుధాకర్, పలువురు కార్పొరేటర్లు, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు దాసరి వరలక్ష్మి, అమీనా అన్సారీ, పట్టణ సమాఖ్య ప్రతినిధులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఆలయ నూతన కమిటీ ఏర్పాటు


నూతన కమిటీని అభినందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో వేంచేసి ఉన్న విజయ దుర్గ అమ్మవారి ఆలయ నూతన అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ తెలిపారు. అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా గుడిమెట్ల యుగంధర్, వైస్ చైర్మన్‌లుగా వందనపు నాగ అప్పలరాజు, కర్పూరం కృష్ణ, కార్యదర్శిగా గొల్లపూడి రమేష్, కోశాధికారిగా తోట మణికంఠ, సహాయ కార్యదర్శులుగా దేవకి రామకృష్ణ, గుండ్రోతు సత్యనారాయణ, కమిటీ సభ్యులు జల్లిపల్లి శివకృష్ణ, జోరిగే సాయిరాంగా ఎన్నికైనట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి మాడా రామమోహన్‌రావు తెలిపారు. నూతన కమిటీకి ఆలయ ప్రధాన అర్చకుడు సుదర్శనం వేణుగోపాలాచార్యులు వేద ఆశీర్వచనం పలికారు.

నేడు రెడ్డిగణపవరంలో గడప గడపకు మన ప్రభుత్వం

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరం గ్రామ పోలవరం నిర్వాసితుల కాలనీల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొని తూటిగుంట, పల్లపూరు, పైడాకులమామిడి నిర్వాసిత గ్రామాల్లో పర్యటించి అక్కడి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తారని పేర్కొన్నారు. అనంతరం రెడ్డిగణపవరంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే బాలరాజు ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల ఉద్యోగులు పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలు ప్రారంభం

చింతలపూడి: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార పదార్థాలను వినియోగించడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చునని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.రాంబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలను మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌కే షకీలా ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జ్ ఇ.జయరాజు, పి.నాగరాజు, బి.నరశింహ, గుత్తి శ్రీనివాసవర్మ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం పి.అంకంపాలెం సమీపంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంపై స్థానిక పోలీసులు సోమవారం అర్ధరాత్రి పేకాట శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో సుమారు 9 మంది వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. నిందితుల నుంచి రూ.1,56,840 నగదు స్వాధీనం చేసుకుని, రెండు కార్లను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

వెండి కుందుల సమర్పణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పడమర వీధి వీర బ్రహ్మేంద్ర స్వామి విశ్వకర్మ భగవాన్ ఆలయంలో స్వామివారి పూజల నిమిత్తం నగరానికి చెందిన బంగారు ఆభరణాల వ్యాపారులు వెండి దీపారాధన కుందులు సమర్పించారు. నగరానికి చెందిన కేకేఎస్ జ్యూయలరీ అధినేత, కాద రాంబాబు, కాద బ్రహ్మాజీ కుటుంబ సభ్యులు అందజేశారు.